క్లుప్తంగా

మున్సిపల్ వర్కర్ల భిక్షాటన



మున్సిపల్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తున్న లైటింగ్, వాటర్ సప్లయ్ వర్కర్స్

రామచంద్రపురం: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సానుకూలమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ లైటింగ్, వాటర్ సప్లయ్ వర్కర్స్ గత కొంత కాలంగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. మున్సిపల్ కార్యాలయం వద్ద గల సమ్మె శిబిరంలో శనివారం ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ భిక్షాటన చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశానికి వచ్చిన కౌన్సిలర్లను, ఇతర అధికారులను, ప్రజా ప్రతినిధులను తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, గత కొంత కాలంగా తాము సమ్మెలో ఉన్న కారణంగా కుటుంబాలు పస్తులు ఉంటున్నామని చెబుతూ భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపాలిటికి చెందిన లైటింగ్, వాటర్ సప్లయ్ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి



మండపేటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): 36 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోవడం ఎంతగానో కలచివేస్తోందని మున్సిపల్ వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ప్రభుత్వ మొద్దు నిద్రను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు సుబ్బరాజు, కప్పల అన్నవరం, పిట్టా ప్రవీన్ కుమార్, సైనం భాస్కరరావు, మండపాటి గన్నియ్య పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



చెల్లూరులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీవైఈవో రామలక్ష్మణ మూర్తి

రాయవరం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేందుకు ప్రతి ఒక్కరి కృషి చేయాలని రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి సూచించారు. మండలంలోని చెల్లూరులో శనివారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవ్‌లో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు చిన్నారులను పాఠశాలలో ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పిస్తే కలిగే లాభాలను తల్లిదండ్రులకు ఆయన వివరించారు. స్థానిక టీచర్లు ఆయన వెంట పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి సమప్రాధాన్యం

- కౌన్సిల్ సమావేశంలో ఎంపీ బోస్ సూచన
- ప్రొటోకాల్‌పై కౌన్సిల్‌లో నిరసన
- నిధుల కేటాయింపుల్లో సుదీర్ఘ చర్చ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్



సాక్షిలో ప్రచురితమైన ప్రొటోకాల్‌కు తిలోదకాలు కథనం పోస్టర్లతో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో ప్రతీ వార్డు అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా వార్డు కౌన్సిలర్లకు పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సూచించారు. పురపాలక సంఘం కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ బోస్ హాజరయ్యారు. తొలుత సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు తమకు తగిన ప్రొటోకాల్ పాటించడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ 'సాక్షి'లో 'ప్రొటోకాల్‌కు తిలోదకాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనాన్ని ప్రదర్శిస్తూ నల్లబ్యాడ్జీలతో నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 20న మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లను ఆహ్వానించకుండా కేవలం కూటమి నేతలతో మెప్మాకు చెందిన ట్యాబ్‌లను పంపిణీ చేయటంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్‌లు సమాధానం చెప్పాలని నిరసిస్తూ వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు నిలుచుని నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ రాజు మాట్లాడుతూ ఆనాడు అనుకోకుండా జరిగిన కార్యక్రమం కావడంతో కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వలేకపోయామని భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు లేకుండా చూసుకుంటామని చెప్పారు. దీంతో ఎంపీ బోస్ మాట్లాడుతూ కమిషనర్ రాజు వివరణ ఇచ్చారు కాబట్టి కౌన్సిలర్లు నిరసనను విరమించాలని కోరడంతో కౌన్సిల్ సమావేశం ప్రారంభం అయింది. తొలుత అజెండాలోని ఒకటో అంశంగా 23వ వార్డు చెరువు గట్టు వీధి పురపాలక సంఘం ఖాళీ స్థలంలో నెట్ క్రికెట్, ఓపెన్‌జిమ్, స్టేజ్, పిరమిడ్ ధ్యానకేంద్రం, చిన్న తరహా వ్యాపారస్తులు, మహిళా స్వయం సహాయక సంఘాల వారు వ్యాపారం చేసుకునేందుకు షెడ్‌ల నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, విప్ వాడ్రేవు సాయిప్రసాద్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఇదే స్థలంలో ఎంపీ నిధులు రూ.2 కోట్లతో కల్యాణ మండపానికి నిర్మాణానికి అంచనాలు తయారు చేయించారని డీ నోటిఫై చేయలేదని అప్పట్లో దీనిని నిలుపుదల చేయడం జరిగిందని వివరించారు. తిరిగి ఇదే స్థలంలో ఎలా నిర్మాణాలు చేస్తారని ప్రశ్నించారు. ఒక వేళ షెడ్ల నిర్మాణం చేపడితే కల్యాణ మండపం కూడా నిర్మించాలని దానికి సంబంధించి గతంలో కేటాయించిన స్థలాన్ని వదిలేసి మిగిలిన స్థలంలో నెట్ క్రికెట్, ఓపెన్‌జిమ్, స్టేజ్, పిరమిడ్ ధ్యానకేంద్రం, చిన్న తరహా వ్యాపారస్తులు మహిళా స్వయం సహాయక సంఘాల వారు వ్యాపారం చేసుకునేందుకు షెడ్లు వంటివి నిర్మించాలని, ఆవిధంగా తీర్మానం చేయాలని సూచించారు. దీనిని సభ్యులు రెండింటినీ అక్కడే నిర్మాణం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ పేదవారికి అనుకూలంగా ఉండేందుకు కల్యాణ మండపానికి నిధులు ఇవ్వడం జరిగిందని, పార్టీలకు అతీతంగా ఈ నిర్మాణం జరిగేలా అన్ని విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లను, మున్సిపాలిటీ కమిషనర్ ఇతర అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అనంతరం అజెండాలోని అభివృద్ధి పనులకు సంబంధించి పొందుపర్చిన అంశాలకు కౌన్సిలర్లు పెంటపాటి దేవి, బొక్కా సత్యనారాయణ, కేతా శ్రీను, కో ఆప్షన్‌సభ్యులు మస్తాన్ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధికి నోచుకోని వార్డులు చాలా ఉన్నాయని వాటిలో నిధులు కేటాయించి సీసీ రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై కౌన్సిల్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. ఎంపీ బోస్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి వివిధ స్కీంల ద్వారా వచ్చిన నిధుల మొత్తాన్ని చూసి అన్ని వార్డుల్లోనూ కౌన్సిలర్లు అందరితోనూ సంప్రదించి నిధులు కేటాయించుకోవాలన్నారు. దీనిపై సభ్యులు మాట్లాడుతూ అంతరవరకు ప్రస్తుతం అజెండాలో చూపిన నిధుల కేటాయింపుల అంశాలను వాయిదా వేయాలని చైర్ పర్సన్ శ్రీదేవి కోరడంతో 11వ అంశంలోని 2, 5 పనులను, 14వ అంశంలో మొత్తం పనులను, 15వ అంశంలో 2వ పనిని రద్దు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. కాగా 4వ అంశమైన వెల్ల వాటర్ ప్రాజెక్టు సంబంధించి రూ.1.53 కోట్ల ప్లాంట్ నిర్వహణ ఆమోదం కోసం కౌన్సిల్ సభ్యులకు తెలిపారు. దీనిపై వాడ్రేవు సాయిప్రసాద్, కోలమూరి శివాజీలు మాట్లాడుతూ ఏటా రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్న పట్టణ వాసులకు రక్షిత మంచినీటిని అందించలేకపోతున్నామన్నారు. దీనిపై జనసేన సభ్యుడు అంకం శ్రీనివాస్ కూటా మాట్లాడుతూ సభ్యులు చెప్పింది వాస్తవమేనని పట్టణ వాసులకు పూర్తి స్థాయిలో వెల్ల ప్రాజెక్టు ద్వారా రక్షిత మంచి నీటిని అందించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. అజెండాలోని మొత్తం 24 అంశాలకు గాను 14, 18 అంశాలను రద్దు చేయగా రెండు అంశాలకు పలు సూచనలతో మిగిలిన వాటిని సభ్యులు ఆమోదం తెలిపారు. కాగా అనంతరం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వివిధ వర్కులను సంబంధించిన 4 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆర్డీవో అఖిల



ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లతో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల, సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్

రామచంద్రపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్డీవో డి.అఖిల సూచించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని శనివారం ఆర్డీవో అఖిల ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి వైద్య సేవలపై వైద్యుల ద్వారా ఆరా తీసి రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. బయటి నుంచి వచ్చే రోగులకు ఓపీ సరిపోవడం లేదని మరో కౌంటర్ ప్రారంభించాలని ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ సరళిని ఆమె పరిశీలించి రోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలతో పాటు ఆహారం రవాణా సదుపాయాలు నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా కల్పించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ బిల్లులు చెల్లింపు, ఔషధాల సరఫరా, ఔషధాలను ఆసుపత్రి నుంచి కాకుండా బయట నుంచి కొనుగోలు చేస్తున్నారా అనే కోణంలో రోగులను అడిగి తెలుసుకున్నారు. పవిత్రమైన వైద్య వృత్తి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ రోగుల మన్ననలు చూరగొనాలని ఆమె వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.మృత్యుంజయరావు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

స్థానిక అన్న క్యాంటీన్‌ను ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ క్యాంటీన్లో మెనూ ప్రకారం సమయపాలన పాటిస్తూ నాణ్యత ప్రమాణాలతో తాజాగా భోజనాన్ని వడ్డించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. భోజన నాణ్యత సంతృప్తి స్థాయిలను లబ్ధిదారులు అడిగి తెలుసుకోగా వారు భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించి దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బందిని నియమించాలి



అంగర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్మన్, వైద్యాధికారి

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో రెండో వైద్యుడి నియామకం చేపట్టాలని కోరుతూ అభివృద్ధి కమిటీ తీర్మానం చేశారు. కమిటీ చైర్మన్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, కన్వీనర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి శేషారత్నం సమావేశంలో పలు అంశాలను లేవనెత్తారు. ఆసుపత్రికి రెండో వైద్యుడు, స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే జోగేశ్వరరావు, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులకు సిఫార్సు చేయాలని నిర్ణయించారు. ఆసుపత్రి పనితీరుకు సంబంధించిన అంశాలను ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు వెల్లడించారు. ఆయా గ్రామాల నాయకులు పుత్సల శ్రీనివాస్, తిరునాతి వెంకటేశ్వరరావు, త్రిపురశెట్టి నాని, పిల్లా బసవరాజు, మత్సా గంగరాజు, కవల కృష్ణ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



గొల్లపాలెంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అనుబంధ సంఘాల నాయకులు

కాజులూరు: రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం గొల్లపాలెంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గద్దెనెక్కేందుకు కూటమి నాయకులు అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాకా హామీలన్ని తుంగలో తొక్కారన్నారు. ముఖ్యంగా రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారని అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ఒక్క రూపాయి రైతులకు ఇవ్వలేదన్నారు. రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వకపోగా రైతుల నుంచి కొనుగోలు చేసినా ధాన్యానికి సొమ్ములు కుడా ఇవ్వడం లేదన్నారు. మండల గ్రామాల్లో రైతుల ధాన్యం విక్రయించి యాభై రోజులు గడిచినా సంబంధిత రైతు ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమ చేయలేదన్నారు. విక్రయాలు చేసి నేలన్నర పైబడుతున్నా నేటికీ సొమ్ములు రాకపోవడంతో నారుమడుల సీజన్లో రైతులు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ యువజన విభాగం కన్వీనర్ మాదిరెడ్డి పృథ్వీరాజ్, మండల పార్టీ బీసీ సెల్ కన్వీనర్ చొల్లంగి వెంకటరమణ, ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, ఎంవీవీ సత్యనారాయణ, పోతురాజు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అలీ అస్కర్‌కు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కర్బలా పుణ్యభూమిలో మూడో రోజున అశువులు బాసిన ఇమామ్ హుస్సేన్ చిన్న కుమారుడు హజరత్ అలీ అస్కర్ సంతాప దినాన్ని ద్రాక్షారామలో శనివారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం భక్తులు పాల్గొన్నారు. అలాగే ద్రాక్షారామ అలీ అక్బర్ పంజాలో శనివారం మజ్లిస్ నిర్వహించారు. లక్నో (ఫైజాబాద్) నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మజ్లిస్ ఆలపించి మొహర్రం విషాదం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రామచంద్రపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆర్గనైజర్ చంద్రకళ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చట్టం 2017 గురించి వైద్య శాఖ, ప్రభుత్వ శాఖల అధికారులతో వార్షిక సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. భీమాబాయి మహిళా మండలి హెల్త్ ప్రోగ్రాం ఆర్గనైజర్ జి.చంద్రకళ మాట్లాడుతూ చట్టంలోని ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించి హెచ్ఐవీ చట్టాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలి మండల స్థాయి అమలు అధికారి డి.అర్జునరావు మాట్లాడుతూ హెచ్ఐవీ ఉన్నవారు నింద, వివక్షకు గురి కాకుండా చట్టాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు ఆర్. మాధవి, ఎస్.రమాదేవి, సిబ్బంది, హెచ్ఐవీ బాధితులు పాల్గొన్నారు.

ఆలయానికి అరెకరం విరాళం



ఆలయానికి వరిపొలం విరాళమిచ్చిన పడాల చంద్రమ్మ, కుటుంబ సభ్యులు

కపిలేశ్వరపురం: ఆలయానికి దాత ఇచ్చిన విరాళం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆలవాలం అని పలువురు వక్తలు అన్నారు. అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన పడాల చంద్రమ్మ అర ఎకరం వరి చేనును విరాళంగా అందించారు. పెద్ద మనస్సుతో వరి చేనును ఆలయానికి దానం చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. శనివారం ఆలయ ప్రాంగణంలో పడాల చంద్రమ్మను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు నిర్ణయాన్ని గౌరవించిన ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ దాత ఆలోచన తరతరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ కమిటీ నాయకులు పెద్దింశెట్టి రామస్వామి, దాసర లక్ష్మణమూర్తి, సూరంపూడి వెంకట్రావు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్న బాబు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, నాయకులు సంకాబత్తుల స్వామికాపు, పడాల బూరయ్య, రామకృష్ణ, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, వీరబాబు, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని రూపుమాపుతాం



మంత్రి సుభాష్

రామచంద్రపురం: రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల నిర్మాణం, నూతన పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగాన్ని రూపుమాపుతామని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ప్రపంచంలోనే మేటి రాజధానిని అమరావతిలో నిర్మించి భావితరాలకు, ప్రజలకు అంకితం ఇస్తామని ఆయన తెలిపారు. రామచంద్రపురంలో ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఆర్థిక సమానత్వం సాధించేలా కూటమి ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అంగరలో చెత్త వ్యర్థాల తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: మేజర్ పంచాయతీ అంగరలోని పలు వీధుల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో శనివారం పేరుకుపోయిన చెత్తను గ్రామ కార్యదర్శి ఆర్.మోహన్ పర్యవేక్షణలో పారిశుధ్య కార్మి కులు తొలగించారు.

దమ్ముతోనే పంట సాగు..తోంది

- సాగులో బహుళ ప్రయోజనాలకు అవకాశం
- రెండోసారి దమ్ము ఎంతో శ్రేయస్కరం
- శాస్త్రీయ పద్ధతులపై అవగాహన అవసరం
- 98,507 ఎకరాల్లో ఖరీఫ్ సాగు



బలుసు రవి, వ్యవసాయాధికారి



చిన్న ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

కపిలేశ్వరపురం: జిల్లాలో గత ఐదు రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు రైతు సన్నద్ధమవుతున్నాడు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 98,507 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సాగులో తొలి ప్రక్రియ దమ్ము చేసే విషయంలో రైతన్నలు నూతన పద్ధతులను అవలంబించాలంటూ కపిలేశ్వరపురం మండల వ్యవసాయ శాఖాధికారి బలుసు రవి పలు సూచనలు చేశారు.

తక్కువ లోతు దమ్ముతో ప్రయోజనాలెన్నో..

చేనుకు మందు చల్లేటప్పుడు రైతు అడుగులు సక్రమంగా పైపైన పడుతుంటాయి. పని సునాయసనంగా తేలిపోతుంది. దమ్ములో మూన లోతుగా వెళ్లడంతో మూన త్వరగా వేళ్లు వేసుకుంటుంది. 15 సెంటీమీటర్లు మాత్రమే లోతు ఉండటం వల్ల ఎరువు సక్రమంగా మూనకు చేరుతుంది. మూన త్వరగా దుబ్బుగా మారడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

లోతైన దమ్ముతో ఇబ్బందులు

సాధారణంగా దమ్మును లోతుగా చేయడం రైతులు చేస్తుంటారు. దీనివల్ల నాట్లు వేసేటప్పుడు మూన లోతుగా భూమిలోకి దిగి పైకి వచ్చేందుకే ఎక్కువ రోజులు పడుతుంది. రైతు పాదాలు లోతుగా వెళ్లి అధిక శ్రమను వెచ్చించాల్సి వస్తుంది. వరికి సంబంధించిన వేర్లు ఆరు నుంచి ఆరున్నర అంగుళాలు మాత్రమే భూమి లోతులోకి వెళ్తాయి. అడుగు, అడుగున్నర లోతులో దమ్ము చేస్తే ఎరువులు మరీ కింది భాగానకి వెళ్లి వేర్లను తాకక నిరుపయోగంగా మారుతాయి. శాస్త్రీయ పద్ధతి ప్రకారం 15 సెంటీమీటర్లు దమ్ము సరిపోతుంది.

చిన్న ట్రాక్టర్‌తో మేలు

దమ్మును 15 సెంటీమీటర్లు చేస్తే సరిపోతుందనుకున్నప్పుడు చిన్న ట్రాక్టర్‌తో దమ్ము చేయించుకోవడం మేలు. పెద్ద ట్రాక్టర్ బరువు అధికంగా ఉండటంతో అడుగులోతు దిగుతుంది. చిన్న ట్రాక్టరుతో సరిగ్గా 15 సెంటీమీటర్లు లోతు పడుతుంది. సంప్రదాయ పద్ధతిని వీడి చిన్న ట్రాక్టరును వినియోగించేందుకు రైతు ముందుకు రావాలి.

రెండో దమ్ముతో ప్రయోజనం

తొలి దమ్ము పూర్తైన వారం తర్వాత, మరో మారు దమ్ము చేసుకోవడం మంచిది. ఇటీవల రైతులు ఈ పద్ధతిని వీడుతూ ఒకే సారి దమ్మును శ్రమ తగ్గుతుందని పూర్తి స్థాయిలో చేయించేస్తున్నారు. దీని వల్ల గడ్డి సక్రమంగా కుళ్లదు. వరినాట్లు అయిన తర్వాత ఆ గడ్డి కుళ్లి గ్యాస్‌గా మారుతుంది. దీంతో దుబ్బు తయారీలో ఇబ్బందులెదురవుతాయి. మొదటి దమ్ములో ఎకరాకు 4 బస్తాల సూపర్ ఎరువును వేయడంతో కాల్షియం, సల్ఫర్ (గంధకం) మూలకాలు అందుతాయి. దీనివల్ల వేర్లు త్వరగా అభివృద్ధి చెందడానికి, గింజ పోసుకునే ప్రక్రియలో నాణ్యత పెరిగేందుకు, తద్వారా తూకంలో బరువు పెరిగేందుకు దోహదం చేస్తుంది.

వెదజల్లులో జాగ్రత్తలు తప్పనిసరి

విత్తనాలు జల్లేందుకు 15 రోజులు ముందే తొలి దమ్ము చేయాలి. విత్తడానికి నాలుగు రోజులు ముందే మరోసారి దమ్ము చేయాలి. సమానంగా దమ్ము చేసి మట్టి పేరుకున్న తర్వాత ప్రతీ రెండు మీటర్లుకు 20 సెంటీమీటర్ల కాల్వలు ఏర్పాటు చేయాలి. మొలక బయటకు రాగానే పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా వెదజల్లాలి. లేదా డ్రమ్ సీడర్ ద్వారా నీటిని పూర్తిగా తీసివేసి కూడా విత్తవచ్చు. మొక్కలో మొదటి ఆకు విచ్చుకునే వరకూ (7 లేదా 10 రోజులు వరకూ) పంటకు ఆరుతడి అవసరం. వెదజల్లు పద్ధతిలో వరి సాగు వల్ల తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చు.

రెండు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగు ఇలా..

మండలం	ఎకరాల్లో
మండపేట	16,008
రాయవరం	14,101
కపిలేశ్వరపురం	15,763
రామచంద్రపురం	17,963
కె.గంగవరం	15,589
కాజులూరు	19,083
మొత్తం	98,507

తవ్వకాల్లో బయటపడిన దేవతా విగ్రహాలు



తాత్కాలికంగా విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు దాసరిపాడులో ఈ నెల 15న జరిపిన తవ్వకాల్లో కొన్ని దేవతా విగ్రహాలు బయటపడ్డాయి. ఇందులో 4 అమ్మవారి విగ్రహాలు ఉండటంతో పాటు ఒక వినాయకుడి విగ్రహం, సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహం ఒకటి గుర్తు తెలియని విధంగా ఒక విగ్రహం లభించాయి. గ్రామంలోని పెద్దలు లింగ పార్వతి అమ్మవారిగా చెబుతున్నారు. సుమారు 200 ఏళ్ల క్రితం అమ్మవారి ఆలయం ఉండేదని తమ పూర్వీకులు చెప్పేవారని ఇక్కడి పెద్దలు చెబుతున్నారు. దీనిని లింగమ్మ దిబ్బగా పిలిచే వ్యవహారం ఇప్పటికీ వాడుకలోనే ఉందంటున్నారు. దీంతో గ్రామస్తులు తాత్కాలికంగా షెడ్డు నిర్మించి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. అయితే 1996 తుపాను వరకు ఇక్కడ పెద్ద మర్రి చెట్టు ఉండేదని ఈ చెట్టు తొర్రలో కొత్తగా పెళ్లయిన జంట పళ్లు, ఫలహారాలు పెట్టి మొక్కులు తీర్చుకునేవారని చెబుతున్నారు. తుపానుకు ఈ చెట్టు కూలిపోవడంతో ఈ ఆచారం క్రమంగా కనుమరుగయింది. ఇక్కడ పుట్టలు వెలియడంతో ఏటా నాగుల చవితికి మహిళలు, గ్రామస్తులు పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజలు చేసేవారు. తవ్వకాల సమయంలో పుట్టలు తొలగించే సమయంలో పెద్ద గోధుమ తాచు ఎవరికీ హాని కలిగించకుండా వెళ్లిపోవడం తవ్వకాలు జరిపేవారు కళ్లారా చూశారు. ఇక్కడ ఆలయం నిర్మించాలని గ్రామస్తులు యోచిస్తున్నారు.